ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
3
సోమవారం 6 అక్టోబరు 2025



జీఎస్టీ జోష్..!



- వస్తు ఉత్పత్తులపై తగ్గిన ధరలు
- రైతులకు, విద్యార్థులకు ఊరట
- ప్రతి కుటుంబానికి ఏటా రూ.15 వేల వరకు లబ్ధి
- జిల్లాలో అవగాహన కార్యక్రమాలు ముమ్మరం

కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు సామాన్య పేద, మధ్య తరగతితో పాటు అన్ని వర్గాలకు వరాల జల్లు కురిపించింది. దేశంలో తయారయ్యే వస్తు ఉత్పత్తులు, అమ్మకాలపై విధించిన జీఎస్టీ (గూడ్స్ సర్వీసు టాక్స్) పన్నుల విషయంలో సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ప్రపంచ దేశాలు విస్తుపోయేలా దేశ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జీఎస్టీ భారాన్ని తగ్గించి ప్రజల పక్షమంటూ చాటుకుంది. పరిశ్రమలు, యంత్ర పరికరాలు, వాహనాలు, విద్య, వైద్యం, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆహార వస్తువులు ఒకటేమిటి దాదాపు 375 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించింది. ఇది దేశ చరిత్రలోనే అరుదైన ఘట్టమంటున్నారు. గతంలో ఉన్న జీఎస్టీ స్లాబ్ 5, 8, 12, 28 పన్నుల భారాన్ని రద్దు చేసి ఆ స్థానంలో 5-18 స్లాబ్ రేట్లతో జీఎస్టీ అమలు చేసింది. దీంతో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కలగనుంది.



కడప కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఒక పక్క అమెరికా అగ్రరాజ్యం మన దేశంలో ఉత్పత్తయ్యే వస్తు సామగ్రితో పాటు సీఫుడ్ లాంటి అనేకాలపై దిగుమతులు చేసుకొనే విషయంలో 50-100 శాతం జీఎస్టీ పన్నులు విధించి పరిశ్రమ వర్గాలను భయభ్రాంతులకు గురిచేసింది. పరిశ్రమలు డీలా పడుతున్న సమయంలో పాత పన్నుల విధానానికి స్వస్తి పలికి నూతన సంస్కరణలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాంది పలకడంతో ప్రజలకు ఊహించని రీతిలో ఆదా పెరగనుంది. గతంలో జనరల్ సేల్స్ టాక్స్, వ్యాట్ విధానాల తరువాత 2017లో జీఎస్టీ అమలులోకి వచ్చింది. వచ్చిన నాటి నుంచి నాలుగు విధాలుగా స్లాబ్‌లు 5, 8, 12, 28 వస్తువులపై జీఎస్టీ పన్నుల భారం మోపింది. ఆ విధానం ప్రజల్లో వ్యాపార వర్గాల్లో కొంత అసంతృప్తి ఉండేది. కానీ ఇప్పుడు 2 స్లాబుల్లో 5, 18 శాతానికి పన్నులు కుదించడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు దసరా, దీపావళి పండుగల సంబరాల ధమాకా ప్రకటించినట్లయింది. ఈ విధానం సెప్టెంబరు 22 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. మొత్తం 410 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించింది. జీఎస్టీ (పన్నుల) ఫలాలు ప్రజలందరికీ అందించేలా రాష్ట్ర వ్యాప్తంగా ఒక నెల రోజుల పాటు సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

ఏటా రూ.15 వేలకు పైగా ఆదా

నిత్య జీవితంలో ప్రతిరోజు ఇంట్లో వాడే నిత్యావసర వస్తువులు, పాలు పండ్లు, పన్నీరు, సబ్బులు, షాంపులు ఉప్పు, పప్పు, పాలు, తృణ ధాన్యాలు, టూత్ పేస్టులు, సేవింగ్ క్రీములు, ఊరగాయలు, చాక్లెట్, పిస్తా కర్జూరాలు, పండ్లరసాలు, పానియాలు, తదితర 28 రకాల వస్తువులపై జీఎస్టీ పన్నుల భారం 0-5 శాతానికి పరిమితం చేశారు. గతంలో కిరాణా వస్తువులపై 5, 12, 18 శాతం స్లాబ్ రేట్లతో పన్నుల బాదుడుకు స్వస్తి పలికింది. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరగనున్నాయి. నిత్యావసర వస్తువుల కొనుగోలుపై అన్ని వర్గాలకు ఏటా రూ.15 వేలకు పైగా ఆదా కానుందనే అంచనాలు ఉన్నాయి. కొనుగోలు శక్తి పెరగడంతో వ్యాపార వర్గాల్లో అమ్మకాలు కూడా జోరందుకోవడం ఖాయమంటున్నారు.

విద్య, వైద్యంలో 5 శాతమే



విద్య వైద్యంలో భారీగా జీఎస్టీ తగ్గుదల ప్రజలకు మరింత ఊరట కలిగించింది. నేడు దేశంలో విద్య, వైద్యం ఖరీదైనదిగా ముద్రపడింది. ఇలాంటి పరిస్థితుల నుంచి వైద్య వస్తువులు, సామగ్రి, మందులు, ఆపరేషన్ పరికరాల్లో గతంలో ఉన్న 12 శాతంగా ఉన్న జీఎస్టీ పన్నుల భారాన్ని కేవలం 5 శాతానికి కుదించి ఆరోగ్య భరోసా కల్పించారు. విద్యకు సంబంధించి నోట్‌బుక్‌లు, ఎరేజర్లు, మ్యాపులు పాఠ్య పుస్తకాలు తదితరాలు 0 శాతం జీఎస్టీకి తగ్గించగా రంగుపెట్టెలు, జామెంట్రీ బాక్సులు, పేపరు కార్టున్లు, ఇతరాలు 5 శాతానికి పరిమితం చేశారు. వ్యాధుల మందులకు 12శాతం పైగా ఉన్న జీఎస్టీని జీరో శాతం పన్నుతో ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత కల్పించారు. అలాగే యునాని, సిద్ద, హోమియోపతి, వైద్య ఆక్సిజన్ గ్లూకో, థర్మామీటర్లు, వైద్య శస్త్ర చికిత్స పరికరాలు, ఇన్సూరెన్స్ పాలసీలకు సంబంధించి 0-5 శాతానికి తగ్గించారు. ప్రజల్లో అసమానతలు లేకుండా ఉండేలా కేంద్రంలో ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కారు జీఎస్టీ తగ్గించడం శుభపరిణామమంటున్నారు.

రైతులకు పెద్ద పీట

ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని రైతులు నిత్యం ఏదో ఒక మూల ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో కీలకంగా పనిచేసే రైతు కూలీలు దొరకడం గగనమైంది. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయమే జీవనాధారంగా సాగే రైతన్నలకు యంత్ర పరికరాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి తప్పలేదు.



వ్యవసాయ ట్రాక్టర్, డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించిన స్ప్రింకర్లు, టైర్లు, ట్రాక్టర్ విడిభాగాలు, వ్యవసాయ డ్రోన్లు, ఆక్వా కల్చర్ పరికరాలు, పాలక్యాను, కంపోస్టింగ్, హార్వెస్ట్ యంత్రాలు, హైడ్రాలిక్ పెండర్లు, తేనేటీగల యంత్రాలు, 12 రకాల బయో పెస్టిసైడ్స్ వంటి వివిధ రకాల వస్తువులు గతంలో ఉన్న 12 శాతం జీఎస్టీని తొలగించి కేవలం 5 శాతం జీఎస్టీకి కుదించింది. ఈ తగ్గింపు వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరగనుంది.

భవన సామగ్రికి పెరిగిన డిమాండ్



ఇళ్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అనే నానుడి సగటు మనిషికి సవాల్‌గా ఉండేది. ఇన్నాళ్లు ఇళ్ల నిర్మాణ సామగ్రి సిమెంట్, పాలరాయి, గ్రానైట్, గ్రానైట్ బ్లాకులు, ఇటుకలు, పార్టికల్ బోర్డులు, కలప, వెదురు ఫ్లోరింగ్‌లకు 12 శాతం జీఎస్టీ భారం ఉండేది. దీంతో విపరీతంగా పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఇల్లు కలగానే మిగిలేది. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జీఎస్టీ ధరల్లో సిమెంట్‌పై ఉన్న 28 శాతం జీఎస్టీ భారాన్ని 18 శాతం, మిగతా వస్తు సామగ్రిపై 5 శాతం జీఎస్టీ తగ్గించడంతో అన్ని వర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



కార్లు ఇక చౌక

నిన్న మొన్నటి వరకు కార్లు, మోటారు బైక్‌లు, ఆటోలు, ఇంజన్ విడిభాగాలు కొనాలంటే జీఎస్టీ భారం కొనుగోలు దారుడికి తడిసి మోపెడయ్యేది. అక్షరాల 28 శాతం జీఎస్టీ పన్నుల మోత మోగేది. కానీ తాజాగా కేంద్ర, రాష్ట్ర సర్కారు తెచ్చిన జీఎస్టీ సంస్కరణలతో 18 శాతం జీఎస్టీకి పరిమితమైంది. ఇప్పుడు కొన్ని కంపెనీలకు సంబంధించిన చిన్న సైజ్ కార్లు మార్కెట్‌లో రూ.5, 6 లక్షలకే అందుబాటులోకి రానున్నాయి. సగటున రూ.80 వేల నుంచి లక్షకు పైగా ఆదా పొందనున్నారు. మోటారు బైక్‌లకు (350 సీసీ లోపు) ఒక్కో వాహనంపై రూ.8 వేల నుంచి 10 వేలకు పైగా ధరలు తగ్గనున్నాయి.

టీవీలు, ఏసీలపై తగ్గిన ధరలు

ప్రతి కుటుంబంలో టీవీలు, డిష్, హీటర్లు, కుక్కర్లు, ఎయిర్ కండీషన్ లాంటి ఎలక్ట్రానిక్ యంత్రాలు తప్పనిసరిగా ఉండాల్సిందే. ఇన్నాళ్లు జీఎస్టీ భారం 28 శాతం ఉన్నప్పటికీ ఈ ఎలక్ట్రానిక్ పరికరాలు అప్పో, సప్పో చేసి కొని ఫైనాన్స్ కంపెనీలకు నెలనెలా వడ్డీలతో అప్పులు చెల్లించే పరిస్థితి. జీఎస్టీ శాతం 18కు పడిపోవడంతో కొనుగోలు శక్తి పెరగనుంది. ఇకపోతే సోలార్‌వాటర్ హీటర్లు, సిస్టమ్స్, సోలార్ కుక్కర్లు 12 శాతం నుంచి 5 శాతానికి పరిమితం చేశారు. అంతేకాకుండా చిన్నపిల్లలు ఆడుకొనే బొమ్మలు, ట్రైసైకిళ్లు, స్కూటర్లు, పెడల్ కార్లు, ఇత్తడి, రాగి, అల్యూమినియం కళాకృతులు, క్యారం, చదరంగం తదితరాలన్నింటిని కూడా జీఎస్టీ 5 శాతానికి తగ్గించారు.

అన్ని కొనుగోళ్లపై జీఎస్టీ ఫలాలు వర్తింపు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ విధానంలో తెచ్చిన సంస్కరణల వల్ల అన్ని వర్గాలకు ఆర్థికంగా లబ్ధి చేరనుంది. జీఎస్టీ ఫలాలు ప్రజలందరికీ పారదర్శకంగా అందేలా చూస్తాం. గత నెల 22 నుంచి ధరల్లో మార్పు వచ్చింది.. వినియోగదారులు గమనించాలి. ఎవరైనా అతిక్రమించిన వ్యాపారులు, సంస్థలపై కంట్రోల్ రూమ్ నెంబరు 8712631286కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే జీఎస్టీ ఫలాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- జి.సుమతి, జీఎస్టీ జాయింట్ కమిషనరు

రూ.436 కోట్ల ఆర్థిక సాయం హర్షణీయం

- ఆటో ఓనర్లకే కాకుండా డ్రైవర్లకూ ఇవ్వాలి
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ల పథకం ద్వారా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున 2,90,669 మందికి రూ.436 కోట్ల ఆర్థికసహాయం చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన వేంపల్లెలో మీడియాతో మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల పథకం అనే బదులు ఆటో ఓనర్ల పథకం అని పెట్టి ఉంటే సమంజసంగా ఉండేదని, రాష్ట్రంలో 12 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉండగా వారిలో 2,90,669 మంది మాత్రమే ఓనర్ కమ్ డ్రైవర్లు ఉన్నారన్నారు. కొందరు ఆటోలు బాడుగకు తీసుకొని జీవనం సాగిస్తూ ఉంటారని, కూటమి ప్రభుత్వానికి నిజంగా ఆటో డ్రైవర్ల పట్ల చిత్తశుద్ధి ఉంటే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఆటోల ద్వారా జీవనం సాగించే ప్రతి ఒక్క ఆటో డ్రైవర్‌కు ఈ పథకం వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జీఎస్టీ తగ్గింపు ప్రచారంలో మాత్రమే ఉందని, క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదని విమర్శించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు సబ్సిడీతో కూడిన రుణాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పూల నజీర్, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఐదు స్వచ్ఛాంధ్ర అవార్డులు

- నేడు కలెక్టరేట్‌లో ప్రదానం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సర్వేలో జిల్లాలోని ఐదు ఉన్నత పాఠశాలలు ఉత్తమ పాఠశాలలుగా ఎంపికయ్యాయి. ఆగస్టు 20 నుంచి సెప్టెంబరు 27 వరకు నిర్వహించిన సర్వేలో ఆర్‌ఆర్ఆర్ (రెడ్యూస్, రీయూస్, రీసైకిల్) విభాగంలో వేపరాల జడ్పీ హైస్కూల్, హిమకుంట్ల జడ్పీ హైస్కూల్, దువ్వూరు కస్తూర్బా బాలికల విద్యాలయం, కడప నగరపాలక ఉన్నత పాఠశాల (మెయిన్), రామేశ్వరం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలు విశేష ప్రతిభ కనబరిచాయి. ఈ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది అక్టోబరు 6న సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో జరిగే స్వర్ణాంధ్ర 2025 జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొని అవార్డులు అందుకోనున్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ : డీఆర్వో

కడప కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు పాల్గొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. అలాగే ఉదయం 9-30 గంటలకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉంటుందని, ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

డ్రైవరు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప మారుతీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కడప డిపోలో డ్రైవరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆర్టీసీ కడప రీజనల్‌మేనేజరు గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు పద్ధతి ద్వారా పోస్టులను భర్తీ చేయనున్నామని, హెవీ లైసెన్సుతో పాటు 18 నెలల అనుభవం కలిగి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఆధార్‌కార్డు, విద్యార్హత, ఆర్టీవో క్లియరెన్స్ సర్టిఫికెట్స్‌తో తమ కార్యాలయంలోని జిల్లా డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్.క్రిష్ణారెడ్డిని సంప్రదించాలని కోరారు. వివరాలకు 7382864533 నెంబరును సంప్రదించాలన్నారు.

రెడ్డెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సంతాన లక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ఉదయాన్నే అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంతానం లేని దంపతులు సంతానం కోసం ఆలయంలో వరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కు తీర్చుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారా యి. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరిగా చేయాలి

- ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య



సైక్లింగ్ చేస్తున్న ఏఆర్ ఏఎస్పీ, సిబ్బంది

కడపక్రైం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య సూచించారు. ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాలతో ఫిట్ ఇండియా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ఆదివారం పోలీసు అధికారులు నిర్వహించారు. ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌ను అలవాటు చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అందులో భాగంగా కడప నగరంలో సన్‌డేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌లో పాల్గొనాలని, తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కాగా ఈ సైకిల్ ర్యాలీ పోలీసు కార్యాలయం నుంచి ప్రారంభమై ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, సంధ్య, ఎర్రముక్కపల్లె, మహవీర్, అంబేడ్కర్ సర్కిళ్ల మీదుగా ఎస్పీ బంగ్లా, రాజారెడ్డివీధి వరకు వెళ్లి తిరిగి జిల్లా పోలీసు కార్యాలయం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు శివరాముడు, టైటస్, శ్రీశైలరెడ్డి, కడప టూటౌన్ సీఐ గంటా సుబ్బారావు, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ట్రాఫిక్ సీఐ జావీదు, పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూదనరెడ్డి, కడప వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

7 భక్తిశ్రద్ధలతో కనుమ పోలేరమ్మ రథోత్సవం



తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి..? 7

ఇరువురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రూ.30 లక్షల విలువ గల బంగారు, వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



మీడియా సమావేశంలో చోరీ కేసుల్లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో వరుసగా జరిగిన చోరీ కేసుల్లో ఇరువురు నిందితులను శని, ఆదివారాల్లో పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.30 లక్షల విలువ గల బంగారం, వెండి నగలతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ కృష్ణమోహన్ వివరాలు తెలిపారు. కడప పట్టణం అంగడివీధికి చెందిన షేక్ నౌమాన్ మస్తాన్ అనే వ్యక్తి పెయింట్ పనిచేసుకుంటూ రాత్రి సమయాల్లో చోరీలకు పాల్పడేవాడు. ఇతడిపై రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో నాలుగు కేసులు నమోదయ్యాయి. అంతేగాక ప్రొద్దుటూరు వన్‌టౌన్, టూటౌన్, ఎర్రగుంట్ల, మైదుకూరు, జమ్మలమడుగు, ఖాజీపేట పోలీస్‌స్టేషన్లతో పాటు కర్నూలు జిల్లా బనగానపల్లి తదితర పోలీస్‌స్టేషన్లలో 9 దొంగతనం కేసులు నమోదు కాగా ప్రస్తుతం కడప జిల్లాలో మరో మూడు ప్రాంతాల్లో తాజాగా చోరీకి పాల్పడినట్లు తెలిపారు. షేక్ నౌమాన్ అలియాస్ మస్తాన్‌ను శనివారం రాత్రి రాయచోటి పోలీసులు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి రూ.21 లక్షల 30 వేల విలువ గల 375 గ్రాముల బంగారం, వెండి నగలతో పాటు ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాదుకు చెందిన ప్రస్తుతం కడప పట్టణం మోచంపేటలో నివాసం ఉంటున్న మహమ్మద్‌షాఅలీజబ్రి అలియాస్ షేక్ మహమ్మద్ రెహమాన్, అలియాస్ అబ్దుల్లా, అలియాస్ సోహెల్ అనే యువకుడు చైన్‌స్నాచింగ్‌లకు పాల్ప డేవాడు. చెన్నూరు, రాయచోటి పట్టణాల్లో పలువురి మహిళల మెడలో బంగారు గొలుసుల చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఇతడిపై ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 175కుపైగా కేసులు నమోదైనట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. ఆదివారం ఉదయం నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.9 లక్షల 50 వేల విలువ గల 95 గ్రాముల మూడు తాళిబొట్టు చైన్‌లను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపెట్టినట్లు డీఎస్పీ వివరించారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన రాయచోటి అర్బన్ సీఐ బీవీ చలపతి, ఎస్ఐలు బాలకృష్ణ, అబ్దుల్‌జహీర్, సీసీఎస్ ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది అమర్‌నాథ్, బాబ్జీ, రామకృష్ణ, సురేంద్ర, సీసీఎస్ సిబ్బంది బర్కత్, మహేంద్రలను రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ ప్రత్యేకంగా అభినందించారు.

12 టన్నుల టపాసులు స్వాధీనం

- పరిమితికి మించి గోడౌన్‌లో నిల్వలు
- యజమానిపై కేసు నమోదు



టపాసుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ భావన, సీఐ నాగభూషణం

ప్రొద్దుటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని పలు టపాసుల గోడౌన్‌లో పరిమితికి మించి టపాసులు నిల్వ ఉంచడంపై డీఎస్పీ భావన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వన్‌టౌన్, టూటౌన్, రూరల్ సీఐలు తిమ్మారెడ్డి, సదాశివయ్య, నాగభూషణంలతో కలిసి ఆమె ప్రకాశ్‌నగర్, ఆటోనగర్, పొట్టిపాడు రోడ్డులోని టపాసుల గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గోడౌన్ లైసెన్సు పరిమితికి మించి టపాసుల స్టాక్‌ను నిల్వ చేయబడినట్లు గుర్తించారు. దీంతో అదనంగా నిల్వ వుంచిన 12 టన్నుల టపాసుల స్టాకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోడౌన్ల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఐలను ఆదేశించారు. ఈ సందర్భంగా టపాసుల గోడౌన్స్ లైసెన్సుదారులు పాటించాల్సిన సూచనలను వారికి తెలియజేశారు. లైసెన్సు ఉన్న వారు మాత్రమే టపాసుల గోడౌన్లు నడపాలని, గడువు ముగిసిన లైసెన్సులను వెంటనే పునరుద్ధరించుకోవాలన్నారు. లైసెన్సు లేకుండా నిల్వ ఉంచితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గోడౌన్స్‌లో ఫైర్ పరికరాలు మట్టికుంపట్లు, నీటి డ్రమ్ములు ఉండేలా చూసుకోవాలని, స్టోరేజి ఏరియాల్లో ఫైర్ అలారాలు, స్మోక్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలతో 24 గంటలు భద్రత కల్పించాలని, 18 సంవత్సరాలు నిండని మైనర్లు గోడౌన్స్‌లో పనిచేయించకూడదని వెల్లడించారు.

ఏమారితే యమలోకానికే..!

● ఒరిగిన విద్యుత్ స్తంభాలు ● పట్టించుకోని విద్యుత్ అధికారులు

పెండ్లిమర్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒరిగిన విద్యుత్ స్తంభాలు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎల్లప్పుడూ ప్రమాదకరంగా ఉంటాయి.ముఖ్యంగా వర్షాలు,గాలి వంటి వాతావరణ పరిస్థితులు ఉన్నప్పుడు ఈ ప్రమాదం మరింత ఎక్కువ అవుతుంది.తుఫానులు వచ్చినపుడు ఒరిగిన స్తంభాలు పడిపోయి వాటికి ఉన్న విద్యుత్ తీగలు నేలను తాకుతాయి.ఆ తీగలను తగిలినప్పుడు ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది.ఏమాత్రం ఏమారితే యమలోకానికి వెళ్లినట్లే.సబ్‌స్టేషన్ పరిధిలో పని చేసే సిబ్బంది వారికి కేటాయించిన రూట్లో విద్యుత్ లైన్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలి. అలాగే ప్రజలు ఫిర్యాదులు చేస్తే వాటిని పరిశీలించి చర్యలు చేపట్టాలి.మండల పరిధిలోని గొందిపల్లె గ్రామ రెవెన్యూ పరిధిలోని నాగాయపల్లె విద్యుత్ ఫీడర్‌కు వెళ్లే దారిలో హెచ్‌టి లైన్, సబ్‌స్టేషన్‌కు వెళ్లే విద్యుత్ లైన్లు ఒరిగి పడేందుకు సిద్ధంగా ఉన్నాయి.నందిమండలం,తుమ్మలూరు,కొండూరు గ్రామాలలో విద్యుత్ ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగింది.ప్రతి నెల రెండో శనివారం ట్రీకటింగ్ పేరుతో లైన్ల క్రింద ఉండే చెట్లను తొలగించాలి. అప్పుడైనా ఒరిగిన స్తంభాలు సిబ్బందికి కనిపిస్తాయి.విద్యుత్ సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలి.కాని కింది స్థాయి చిన్న ఉద్యోగి కూడా ఉండరు. రైతుల సమస్యలకు స్పందించరు. అన్నీ ఉన్నా అనుమతుల కోసం తిప్పుకునే అధికారులను చూస్తున్నాం.రైతులకు వ్యవసాయానికి మోటార్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటే రెవెన్యూ,విద్యుత్ అధికారుల అనుమతి తప్పని సరిగా ఉండాలి.అవి ఏమీ లేకుండానే పెద్దదాసరిపల్లె గ్రామ రెవెన్యూ పరిధిలోని 253-1లోని భూమికి విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.ఈ విషయమై గ్రామ రెవెన్యూ అధికారి కేశవను వివరణ అడగ్గా మేము ఉలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అలాగే విద్యుత్ ఏఈని అడగ్గా తాను ఎవ్వరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.అలాగే నందిమండలం సబ్‌స్టేషన్ పరిధిలోని తిప్పరాజుపల్లె గ్రామంలో నూతనంగా కట్టుకున్న గృహాలకు ఎటువంటి ముందస్తు అనుమ తులు లేకుండానే క్రింది స్థాయి సిబ్బంది విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేశారని పెద్దదుమారమే జరిగింది. ఈ మీటర్ల వ్యవహారంపై పైస్థాయి అధికారులకు పిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా విచారణ చేశారు. మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కారం జరగాలంటే రైతులు చాలా ఇబ్బంది పడాల్సివస్తోంది. కాగా ఒరిగిన విద్యుత్ స్తంభాలు గురించి నందిమండలం ఏఈ నవనీతాబాయికి తెలుపగా లైన్‌మెన్‌ను పంపి పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.



తిప్పరాజుపల్లె ఒరిగిన విద్యుత్ స్తంభాలు



గొందిపల్లె పరిధిలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

ఎస్టీజాబితాలో వడ్డెరలను చేర్చాలి

కడప మారుతీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వడ్డెరలను ఎస్టీ జాబితా లో చేర్చే వరకు పోరు కొనసాగిస్తామని వడ్డెర సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం స్థానిక పాత రిమ్స్‌లో ఉన్న బీసీ భవన్‌లో వడ్డెర సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో జిల్లా వడ్డెర సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో గౌరవ అధ్యక్షుడుగా బత్తల జానకిరాం, జిల్లా అధ్యక్షుడుగా డేరంగుల శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంటుగా బత్తల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా వెంకట్, కోశాధికారిగా గంపా శ్రీనును ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగ మూర్తి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టరు గండికోట వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్

కడప క్రైం , అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్ పాటుపడుతుందని పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అందులో భాగంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. అనుమానా స్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తు న్నారు.

అనాథలకు అన్నదానం

వేంపల్లె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె నాగమ్మనగర్‌లో ఉన్న మదర్ థెరిస్సా అనాథ ఆశ్రమంలో ఆదివారం అన్నదానంచేశారు. చింతలమడుగుపల్లెకు చెందిన సింగారెడ్డి వీరమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆమె జ్ఞాపకార్థం అన్నదానం చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు ఓబులమ్మ, సార్థక్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి, సౌజన్య, చేతన్‌సింహారెడ్డి, మౌక్తికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగ జేఏసీ చేపట్టిన సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సమ్మెలో పాల్గొననున్నట్లు జేఎల్ఎం గ్రేడ్-2 అసోసియేషన్ (ఎనర్జీ ఎంప్లాయీస్) రాష్ట్రసమితి ప్రకటించింది. ఆదివారం కడప ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్‌రాష్ట్ర అధ్యక్షుడు కె.మల్లికార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.సుధీర్‌బాబు మాట్లాడారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి, హేమకుమార్, హరికృష్ణ, అశోక్, ప్రతాప్ పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

వేంపల్లె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఫ్యాప్టో నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ సంఘం ఆధ్వర్యంలో వేంపల్లె రీజియన్ కార్యాలయంలోసన్నాహక సమావేశాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబరు 7ననిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రీజియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, మండల శాఖ బాధ్యులు లక్ష్మీనరసింహ, బాబు, జిల్లా బాధ్యులు ధర్మారెడ్డి, ఎస్.ధర్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలానికి 45 టన్నుల యూరియా

చెన్నూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామనపల్లె, రాచిన్నాయపల్లె రైతుల కోసం సోమవారం పంపిణీ చేసేందుకు 45 టన్నులు యూరియా సిద్ధంగా ఉందని ఏవో శ్రీదేవి తెలిపారు. రామనపల్లె, రాచిన్నాయపల్లె రైతులకు రామనపల్లె రైతు సేవా కేంద్రం ద్వారా పంపిణీ చేస్తామని ఆమె అన్నారు. అలాగే చెన్నూరు గ్రోమోర్ సెంటరు, రైతు భరోసాకేంద్రం ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు ఖరీఫ్ సీజనులో వేసిన పంట కోసం ఈ యూరియా పంపణీ చేస్తున్నామని, పట్టాదారుపుస్తకం, ఆధార్‌తో రైతులు రావాలని ఆమె తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా నాగూర్ ఎంపిక



అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు నాగూర్

సింహాద్రిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప రికగ్నైజ్డ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ ఆధ్వర్యంలో సింహాద్రిపురం శ్రీ వివేకానంద హైస్కూల్ ఉపాధ్యాయుడు ముల్లా ఖాదర్‌వలి (నాగూర్) ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. ఆదివారం ప్రొద్దుటూరులో నిర్వహించిన సమావేశంలో కడప డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, ఎంఈఓ సరస్వతి చేతులమీదుగా నాగూర్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు షీల్డ్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి, డైరెక్టర్ జాఫర్, ఉపాధ్యాయులు నాగూర్‌కు అభినందనలు తెలిపారు.


థ్యాంక్యూ సీఎం సార్



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 5 (ఆంధ్ర జ్యోతి): థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆదివారం మాచు పల్లె బస్టాండ్ సర్కిల్లోఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు మునిరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు మాసాపేట శివ మాట్లాడుతూ చంద్రబాబు ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేలు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, ఓబులురెడ్డి, జయకుమార్, ఆటో యూనియన్ నాయకులు రామయ్య,నాయుడు, శివారెడ్డి, సుబ్బా నాయుడు, రామ్‌మోహన్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, వేణు, సుబ్బయ్య, సుధాకర్, మల్లి, మునయ్య పాల్గొన్నారు.

విద్యార్థి అభ్యున్నతికి కారకుడు ఉపాధ్యాయుడే



అవార్డుప్రదానం చేస్తున్న దృశ్యం

కడప మారుతీనగర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి అభ్యున్నతికి కారకుడు ఉపాధ్యాయుడే ప్రధాన కారకుడని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలావుద్దీన్ అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఆలిండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఐటా కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలందించిన ఆరుగురు ఉపాధ్యాయులకు ఆదర్శ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కడప ఎంఈవో రఫిక్ అహ్మద్, ఐటా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు.ఆదివారం స్కౌట్ హాల్లో ఆర్జేయూపీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, ముత్తోజు వీరబ్రహ్మం, షరీఫ్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న గత కాంట్రాక్టర్ పీఎఫ్, ఈఎస్ఐ తక్షణమే చెల్లించాలని నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, నగర అధ్యక్ష కార్యదర్శులు పవన్, రవి ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వీరపునాయునిపల్లె సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో గురువులతో పూర్వపు విద్యార్థులు

వీరపునాయునిపల్లె, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వర ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్ పదో తరగతిపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన సభ ఘనంగా జరిగింది. 36 సంవత్సరాల తర్వాత ఒకరికొకరు కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ స్నేహితులను కలుసుకోవడం వారి ఆనందానికి అవధులు లేవు. సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత ఒంటిగారి వెంకటసుబ్బానాయుడు మాట్లాడుతూ వివిధ ఉద్యోగాలు సాధించడం ఆనందకరంగా ఉందన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు గంగిరెడ్డి, మోహన్, టీవి కృష్ణారెడ్డి, తులసీశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి,రామకృష్ణారెడ్డి, ధర్మారెడ్డి, ప్రమీల, సరస్వతి, సంగమేశ్వర ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వివి సుబ్బానాయుడులను పూర్వపు విద్యార్థులు శాలువ, కప్పిపూలమాలలతో, మెమెంటోలను అందించారు. ఈ సందర్భంగా గురువులకు స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి పూర్వపు విద్యార్థులు రూ.50వేలు విరాళంగా అందించారు.ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడి విగ్రహావిష్కరణ



నివాళులు అర్పిస్తున్న తులసిరెడ్డి

పెండ్లిమర్రి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి లోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు ఎన్‌పి గంగిరెడ్డి విగ్రహాన్ని మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి ఆవిష్కరించాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగిరెడ్డి బ్రిటీష్ వారిని ఎదిరించి 1942 లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో అల్లీపురం నేటి బళ్లారి జైలులో ఆరు నెలల పాటు ఉండడం జరిగిందన్నారు.చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు పెద్ద దిక్కుగా ఉండి,కరువు,కాటకాలలో ప్రజలను తన దాన గుణంతో ఆదుకునే గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషన్నారు.ఈ కార్యక్రమంలో సాయిగంగ ట్రస్టు ఛైర్మెన్‌యియ న్యాయవాది ముని కుమార్ రెడ్డి,బిఆఎస్ జాతీయ నాయకుడు చంద్ర శేఖర్ రెడ్డి,కడప టీడీపీ నాయకులు అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి,జిల్లా బార్ అసోషియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ కిషోర్‌రెడ్డి,కుటుంబ సభ్యులు,న్యాయవాదులు,వైద్యులు,చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి టీడీపీ వైపు అడుగులు



పార్టీలో చేరిన వారితో బీటెక్ రవి

లింగాల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం, స్థానికంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు ఉంటున్నాయని పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో ఆదివారం వైసీపీ నుంచి టీడీపీలోకి రామకృష్ణరెడ్డి, లోకేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, అశోక్‌రెడ్డి, నాగార్జునరెడ్డి 20 కుటుంబాలు మండల టీడీపీ నాయకులు సంజీవరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీటెక్ రవి సమక్షంలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

కడప కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటైన జిల్లా బలిజ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో 10 వతరగతి మెరిట్ విద్యార్థులకు రూ.10 వేల రూపాయలు ఆర్థిక సాయాన్ని నగర ప్రముఖులు పీవీఎస్ మూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఆదివారం నగరంలోని బలిజ సంఘం ఉద్యోగుల కార్యాలయంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా మూర్తి, అమరప్ప,సునీల్ కుమార్ మాట్లాడుతూ బలిజకులంలో పేదరికంలో ఉన్న విద్యార్థులు తమ చదువుల్లో మెరిట్ సాధిస్తే ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దామోదర్, కేశవులు, విజయకుమార్ పాల్గొన్నారు.



నగదు బహుమతి అందజేస్తున్న నేతలు

అటవీ సిబ్బంది ప్రతిభ

కడప ఎన్జీఆర్ సర్కిల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన ఫారెస్టు స్పోర్ట్స్ మీట్‌లో కడప డివిజన్ సిబ్బంది ప్రతిభ చాటారు. కర్నూలు సర్కిల్ స్థాయిలో 4, 5 తేదీల్లో నిర్వహించిన స్పోర్ట్స్‌మీట్‌లో ప్రొద్దుటూరు, కడప, కర్నూలు, నంద్యాల డివిజన్ల అటవీ సిబ్బంది పాల్గొన్నారు. విజేతలైన వారిలో తిరుపాల్, సుంకయ్య, రమేశ్, కబీర్, షాజహాన్, సురేశ్, విజయలక్ష్మి ఉన్నారు. అటవీశాఖ అధికారులు అభినందించారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

కడప నాగరాజుపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విశ్వ కారుణ్యమూర్తి ప్రవక్త మొహమ్మద్ జీవిత చరిత్రపై రాత పరీక్ష పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం కడపలోని సబ్‌జైల్ వద్ద ఉన్న సైనిక్‌నగర్‌లోని మదరసా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్‌లో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్ఎం ముక్తార్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్ ఎస్.ముంతాజ్‌బేగం, శ్రీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సి.ఓబుళరెడ్డి, జామియా బిలాల్ నాజిమ్ ముఫ్తీ మొహమ్మద్ నాసిరుద్దీన్, గౌరవ అతిథులుగా పయాం ఇన్సానియత్ కోకన్వీనర్ మౌలానా ఏక్ మక్బూల్ అహ్మద్ నద్వి, మాజీ కార్పొరేటర్ ఎస్ జమాల్‌వలి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా, పలువురు ప్రముఖులు, మదరస ఉపాధ్యాయులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





రాయచోటి వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం

దిక్కూమొక్కు లేని మార్కెట్ యార్డు

- ప్రహరీ గోడ, ఆర్చి, గేటు లేని వైనం
- నిరుపయోగంగా శీతల గిడ్డంగులు
- ఇదీ రాయచోటి వ్యవసాయ మార్కెట్ యార్డు దుస్థితి

రాయచోటిటౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని మాసాపేటలో కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారికి పక్కన మాండవ్యనది ఒడ్డున సుమారు 22 ఎకరాల విస్తీర్ణంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది పాలకుల నిర్లక్ష్యానికి గురై దిక్కూమొక్కు లేకుండా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాయచోటి, సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం మండలాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను భద్రపర్చుకోవడంతో పాటు విక్రయించేందుకు ఈ మార్కెట్ యార్డును ఏర్పాటు చేశారు. అయితే మార్కెట్‌యార్డు అయినప్పటి నుండి కేవలం పశువుల సంతగా, పౌరసరఫరాల శాఖ నిత్యావసర సరుకుల గోడౌన్‌గా, భూసార పరీక్షల కేంద్రం అవసరాలకు మాత్రమే ఉపయోగపడేది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మార్కెట్‌యార్డు ప్రహరీ గోడతో పాటు కొంత స్థలానికి నష్టపరిహారం కింద రూ.70 లక్షలు అందించింది. కానీ అప్పటి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా ఇప్పటికీ తిరిగి ప్రహరీగోడను నిర్మించకపోవడంతో ప్రస్తుతం ఇది అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మార్కెట్ యార్డుకు మోక్షం కలుగుతుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

యార్డుకు చేరని మామిడి, టమోటా ఉత్పత్తులు

సుమారు 22 ఎకరాల విస్తీర్ణంతో పాటు పంట ఉత్పత్తులను నిల్వ ఉంచేందుకు అవసరమైన గిడ్డంగులు, ప్లాట్‌ఫామ్స్ ఉన్నప్పటికీ మార్కెట్ యార్డు నిర్మించినప్పటి నుండి ఇప్పటి వరకు మామిడి, టమోటా ఉత్పత్తులు మార్కెట్ యార్డుకు వచ్చిన దాఖలాలు లేవు. ప్రధానంగా సుండుపల్లె, సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి మండలాల్లో అత్యధికంగా మామిడితో పాటు టమోటా పంట కూడా సాగులో ఉంది. అయితే రైతులు ఈ పంటలను రాయచోటి పట్టణంలోని ఠాణా సమీపంలో ఉన్న మామిడి మండీలకు, కలకడ, గుర్రంకొండ తదితర ప్రాంతాల్లో ఉన్న టమోటా యార్డులకు తరలించి అక్కడి దళారుల చేతిలో మోసపోతూ నష్టాలపాలవుతున్నారు. అలాగే భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి ఎదురుగా అత్యంత ఇరుకుగా ఉన్న కూరగాయల మార్కెట్‌కు టమోటా, ఇతర కూరగాయలను తీసుకెళ్లి దళారులు నిర్ణయించిన రేట్లకే విక్రయిస్తూ మోసపోతున్నారు. కాగా కొత్తపేట సమీపంలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పక్కనే సిరికల్చర్ కార్యాలయం ఆవరణంలో రూ.కోటి వెచ్చించి ఆధునాతన హంగులతో రైతు బజారును నిర్మించినప్పటికీ వ్యాపారులు, కొనుగోలుదారులు సక్రమంగా రాకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ప్రజలు కూడా అధునాతన సౌకర్యాలతో నిర్మించిన రైతుబజారులో కూరగాయలు కొనుగోలు చేయకుండా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ రోడ్లపైన, మురుగునీటి కాలువలపైన కూరగాయలను విక్రయిస్తున్నా ముక్కు మూసుకొని కొనుగోలు చేస్తుండడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



ఆర్చి, ప్రహరీ గోడ, గేటు లేని రాయచోటి మార్కెట్ యార్డు

ప్రజలకు ఎంతో ఉపయోగకరం

ప్రస్తుతం ఠాణా వద్ద మామిడి మండీలు ఉండడం వలన మామిడికాయల సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుండి వచ్చే పెద్దపెద్ద లారీలు, ఇతర వాహనాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్నారు. ఈ మామిడి మండీలను మాసాపేట వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుకు తరలించడంతో పాటు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయానికి ముందు భాగంలో భక్తులకు అసౌకర్యంగా ఉన్న కూరగాయల మార్కెట్‌ను కూడా మార్కెట్ యార్డులోకి తరలిస్తే పట్టణ ప్రజలకు ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు ఇతర ఇబ్బందులు తొలగుతాయని పలువురు కోరుతున్నారు. ఈ మేరకు పాలకులతో పాటు అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు లక్షలాది రూపాయలు వెచ్చించి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన శీతల గిడ్డంగులు ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా నూతన పాలకవర్గంతో పాటు మార్కెట్ యార్డు అధికారులు యార్డు దుస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రహరీగోడను నిర్మిస్తాం..



రాయచోటి మార్కెట్ యార్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తొలగింపునకు గురైన ప్రహరీగోడ స్థానంలో ప్రభుత్వ అనుమతితో త్వరలోనే నిర్మిస్తాం. అలాగే ముందు భాగంలో ఆర్చి, గేటు కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తాం. అలాగే మామిడి, టమోటా పంటను విక్రయించేందుకు అవసరమైన గదులను కూడా నిర్మించి రైతులకు, వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రాయచోటి మార్కెట్ యార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

- అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్



కంపచెట్లు, పిచ్చిమొక్కలతో ఉన్న మార్కెట్ యార్డు ప్రాంగణం



నిరుపయోగంగా ఉన్న శీతల గిడ్డంగి

వెల్లాల దేవస్థానానికి విరాళాల వెల్లువ



రూ.లక్షా116 విరాళం అందిస్తున్న సంజీవరాయుడు

రాజుపాలెం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైనచెన్నకేశవ సంజీవరాయస్వామి దేవస్థానం పునరుద్ధరణకు విరాళాల వెల్లువ మొదలైంది. ఆదివారం భీమునిపాడు గ్రామం కోవెలకుంట్ల మండలానికి చెందిన చలివేంద్ర సంజీవరాయుడు రూ.1,00,116 విరాళంగా అందించారు. అలాగే ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన అమరావతి లక్ష్మీదేవి రూ.20వేలు అందించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ గంగిరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి, ఆలయ కమిటీ మెంబర్లు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్, స్కూటర్ ఢీ : విద్యార్థి మృతి



మహేష్ (ఫైల్)

చక్రాయపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆంజనేయపురం సమీపాన పాత తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా శనివారం రాత్రి ట్రాక్టర్‌ను స్కూటర్ ఢీకొట్టడంతో మహేష్ (16) అనే విద్యార్థి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దసరా సెలవులు కావడంతో మహేష్ అనంతపురం జిల్లా మడకశివరలో ఇంటర్ సెకండియర్ చదువుతూ ఇంటివచ్చాడు. తండ్రి గొర్రెల కాపరి. ఆంజనేయపురంలో గొర్రెలను తోలుకొని ఉండగా తండ్రికి అన్నం ఇవ్వడానికి మహేష్ గొల్లపల్లె నుంచి ఆంజనేయపురం వెళ్లాడు. తండ్రికి అన్నం ఇచ్చి తిరిగి వస్తుండగా ట్రాక్టరు ఢీకొనడంతో తీవ్రగాయాలు తగలడంతో వేంపల్లెకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు సమాచారం. పోలీసులు విచారించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

డబ్బు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ

- ఇరువురికి గాయాలు

పులివెందుల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పులివెందులకు చెందిన సాతుపాటి శ్రీను, రాజేష్, అలాగే రామేశ్వర్‌రెడ్డి, వెంకటపతిలకు చెందిన ఇరువర్గాల మధ్య డబ్బు విషయమై ఆదివారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాల్లోకెళితే... సాతుపాటి శ్రీను, రాజేష్, పులివెందులకు చెందిన రామేశ్వర్‌రెడ్డి ముదిగుబ్బలో నివాసముంటున్నారు. సాతుపాటి శ్రీను, రాజేష్‌లు బలవంతంగా రూ.9లక్షలు బాకీ ఉన్నట్లు రామేశ్వర్‌రెడ్డితో ప్రామిసరీ నోటు (బాండ్) రాయించుకున్నారు. ఈ విషయమై సాతుపాటి శ్రీను, రాజేష్‌లకు ప్రత్యర్థి అయిన వెంకటపతికి తనతో బలవంతంగా బాండు రాయించుకున్న విషయాన్ని రామేశ్వర్‌రెడ్డి వివరించారు. దీంతో వెంకటపతి అతని అనుచరులు న్యాక్‌బిల్డింగ్ సమీపంలో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గొడవకు దిగేందుకు ప్రయత్నించారు. గొడవ ప్రారంభమయ్యే సమయానికి అర్బన్ సీఐ సీతారామిరెడ్డి, సిబ్బంది ఆ పరిసర ప్రాంతాల్లో ఉండడంతో వెంటనే అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం సాతుపాటి శ్రీను,రాజేష్‌లు ఇంటిపై నుంచి బీరుబాటిళ్లు విసిరేశారు. అప్పటికే ఇరువర్గాలకు చెందిన పలువురు అక్కడకు చేరుకోవడంతో ఘర్షణకు దిగి రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఇరువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డీఎస్పీ మురళీనాయక్, సీఐలు సీతారామిరెడ్డి, రమణ తమ సిబ్బందితో వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గాయపడిన ఇరువురిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భాషా పండితులకు పదోన్నతులు హర్షణీయం



ఎస్‌ఎల్‌టీఏ నేతలను సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పదోన్నతుల కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న భాషా పండితులకు విజయదశమి రోజు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ప్రకటన చేయడం హర్షణీయమని భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ డిగ్రీ కళాశాలలో భాషోపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్లకు పదోన్నతులు కల్పించడానికి కృషి చేసిన ఎస్‌ఎల్‌టీఏ నాయకులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అంకాల్ కొండయ్య ప్రసాద్, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 18 వేల మంది పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన ఘనత రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థకు దక్కుతుందన్నారు. పండిట్లకు పదోన్నతులు రావడానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కృషి చేశారన్నారు. ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య మాట్లాడుతూ హైకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏ పాఠశాలలో పనిచేస్తున్న భాషా పండిట్లకు అదే పాఠశాలలో పదోన్నతులు కల్పించిందన్నారు. కార్యక్రమంలో భాషోపాధ్యాయులు లక్ష్మీనరసయ్య, సుజాత, రామకృష్ణ, రోషన్, లక్ష్మీరాయల్, రామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, మణికంఠ, భాస్కర్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

- నలుగురిపై కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని శంకరాపురానికి చెందిన అంజన గిరిబాబుపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. అంజని గిరిబాబు ఆర్టీసీ బస్టాండు సమీపంలో నడుచుకుంటూ వెళుతుండగా మృత్యుంజయకుంటకు చెందిన మధు తన స్నేహితులతో కలిసి ఎదురుగా వెళ్లి గిరిని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో మధు అతని స్నేహితులు కలిసి గిరి తలపై బాదారు. దీంతో గిరి తలకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి..?

చక్రాయపేట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డంవారిపల్లె సమీపాన నక్కలదిన్నెపల్లెకు చెందిన ప్రతాపరెడ్డి (55) తేనెటీగల దాడిలో మృతి చెందాడని ఆయన కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి పోలీసులు ఫిర్యాదు చేశారు. ఆ వివరాల్లోకి వెళితే... ప్రతాపరెడ్డి, మరికొందరు శనివారం గడ్డంవారిపల్లె సమీపంలోని తెల్లగొండ నారవలో కొయ్యలకు వెళ్లారు. కొయ్యలు కొట్టుకుంటుండగా తేనెటీగలు దాడి చేయడంతో ప్రతాపరెడ్డి మృతి చెందినట్లు కథ అల్లారు. చివరికి గ్రామంలో పుకార్లు చెలరేగాయి. తేనెటీగలు కాదు గుప్తనిధుల కోసం వెళ్లి ఏం జరిగిందో ఏమో ప్రతాపరెడ్డి మృతి చెందాడు. పోలీసులు మాత్రం ఎక్కడ గాయాలు లేవని తెలిపారు. ప్రతాప్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం రాగానే కేసునమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ప్రతాపరెడ్డి మృతిపై పలు అనుమానాలు వస్తున్నట్లు సమాచారం.

వృద్ధురాలిపై దాడి

- బంగారు గొలుసు అపహరణ



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీనరసమ్మ

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిట్వేలి రోడ్డులో నివసిస్తున్న లక్ష్మీనరసమ్మ అనే వృద్ధురాలు ఆదివారం సాయంత్రం బయనపల్లి రహదారిలోని ఒక ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఉన్న చెరువు కట్టపై వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మోటార్ బైకుపై వచ్చి ఆమెపై దాడి చేసి, మెడలో ఉన్న 33 గ్రాముల బంగారు గొలుసును దొంగిలించి పారిపోయాడు. రోడ్డుపై పడిపోయిన ఆమెను గుర్తించిన స్థానికులు వారి బంధువులకు సమాచారం అందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి వెంటనే సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, కొత్త వ్యక్తులపై సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

- పులివెందుల మార్కెట్ యార్డు పాలక మండలి ప్రమాణస్వీకారంలో బీటెక్ రవి



మార్కెట్ యార్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గడ్డం అమర్‌నాథ్‌యాదవ్

పులివెందుల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీ పాలక మండలి రైతుల అభివృద్ధి కోసం కృషి చేయాలని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. ఆదివారం సాయంతరం పులివెందుల మార్కెట్ యార్డులో నూతన పాలక మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పులివెందుల మార్కెట్ యార్డుచైర్మన్‌గా గడ్డం అమర్‌నాథ్‌యాదవ్, కార్యదర్శిగా శ్రీధర్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ ఇప్పటి వరకు పులివెందుల మార్కెట్ యార్డులో చీనీ వ్యాపారం మాత్రమే సాగేదని, అది కూడా కేవలం వంద టన్నుల చీనీకాయలు మాత్రమే వచ్చేవన్నారు. కానీ కలెక్టర్ చొరవతో ప్రస్తుతం 400 నుంచి 500టన్నుల చీనీకాయలు మార్కెట్ యార్డుకు వస్తున్నాయన్నారు. గతంలో ఏడెనిమిది మంది మాత్రమే వ్యాపారులు వేలం వేసేవారని, అది కూడా రూ.15వేలు పలికే చీనీకాయలు రూ.13వేలకే సిండికేట్ అయి పాడుకుంటున్నారనే అపవాదు ఉండేదన్నారు. ప్రస్తుతం ఆ అపవాదు నుంచి బయటపడి అనంతపురం మార్కెట్ కంటే రూ.1000 ఎక్కువగా పాడుతున్నారన్నారు. ఇంకా ఎవరైనా వ్యాపారులు వస్తే ఇక్కడ అవకాశం కల్పిస్తామన్నారు. పులివెందుల మార్కెట్‌యార్డులో రెండు మూడు రోజుల్లో టమోటా వ్యాపారాన్ని కూడా ప్రారంభించబోతున్నామన్నారు. సోమవారం నుంచి ఈనామ్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేయబోతున్నామన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాష, పులివెందుల పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, టీడీపీనాయకులు శివమోహన్‌రెడ్డి, పార్థసారధి రెడ్డి, వేంపల్లె పరిశీలకులు రఘునాథరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరెడ్డి, షబ్బీర్, విశ్వనాథరెడ్డి, బీజేపీ నాయకులు సుష్మ, వాజ్‌పేయి నాయుడు, నవీన్, జనసేన నాయకులు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కనుమ పోలేరమ్మ రథోత్సవం

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆధ్వర్యంలో కనుమ పోలేరమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తిశ్రద్ధలతో రథోత్సవాన్ని ఆలయ గుడి చుట్టూ ఊరేగించారు. ఇందులో దాతలు పెద్దముడియం గ్రామానికి చెందిన సాంబవరం జగదీశ్వర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఈ రథాన్ని వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు ప్రసాద్, మిధున్, నాగలింగాచారి, శ్రీనివాసులు, సుబ్బరాయుడు, చిన్న తదితరులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కారు, లారీ ఢీ : ఒకరికి గాయాలు

పోరుమామిళ్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగపల్లె సమీపంలో ఆదివారం కారును లారీ ఢీకొన్న సంఘటనలో సుబ్బలక్ష్మి అనే మహిళకు గాయాలయ్యాయి. ప్రొద్దుటూరుకు చెందిన సుబ్బలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు పోరుమామిళ్లకు కారులో వెళుతుండగా నర్సింగపల్లె సమీపంలోకి రాగానే లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె కాలికి తీవ్ర గాయం కావడంతో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరుకు తరలించారు.

మంగంపేట వద్ద రోడ్డు ప్రమాదం

- ఒకరు మృతి.. ఇరువురికి గాయాలు

ఒంటిమిట్ట, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపేట ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వివాహిత మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మలకాటిపల్లె గ్రామానికి చెందిన శివారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సాయంత్రం నందలూరు మండలం నల్లతిమ్మాయపల్లెకు తన వాహనంలో బయలుదేరారు. సరిగ్గా మంగంపేట ఆంజనేయస్వామి గుడి సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో శివారెడ్డి భార్య రేణుక(40) సంఘటన స్థలంలోనే మృతి చెందారు. శివారెడ్డి, మరో మహిళ వెంకటలక్షుమ్మకు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముద్దనూరు, అక్టోబర్ 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాపురం సమీపంలోని కొండప్రాంతంలో ఉన్న కంపచెట్లలో ఆదివారం పేకాట ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10,250 నగదు, పేకలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు

తంబళ్లపల్లె, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం తయారీ కేసులో తప్పు ఎవరిదున్నా కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, కఠిన చర్యలు తీసుకుంటుందని టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి నాంది రెడ్డప్ప పేర్కొన్నారు. ఆదివారం ఆయన ములకలచెరువులో కల్తీ మద్యం తయారీని తీవ్రంగా ఖండించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీ మద్యం తయారు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఒక ప్రకటనలో కోరారు.

రేపటి పౌరులను తీర్చిదిద్దే శిల్పులు.. ఉపాధ్యాయులు

- ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి
- ఘనంగా అపుస్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు రేపటి పౌరులను తీర్చిదద్దే మహాశిల్పులని ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అపుస్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఉపాధ్యాయులు సమాజానికి చేస్తున్న నిరుపమాన సేవలను ప్రశంసించారు. ప్రతి ఒక్కరి జీవితంలో ఉపాధ్యాయుడి పాత్ర అత్యంత కీలకమైనదని, అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు నడిపించే ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబరు 5న ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలగంగయ్య, శివశంకర్‌రెడ్డి, ప్రతినిధులు మేడా నరసింహులు, పోలి వెంకటసుబ్బయ్య, మైథిలి తదితరులు పాల్గొన్నారు.





ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, అపుస్మా ప్రతినిధులు.. కార్యక్రమానికి హాజరైనవారు

నేడు విద్యాశాఖ కార్యాలయం ప్రారంభం

కొండాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ నూతన కార్యాలయాన్ని సోమవారం ప్రారంభిస్తారని ఎంఈవోలు ఓబులేసు, రామయ్యలు తెలిపారు. ఉదయం 10 గంటలకు సచివాలయం వద్ద నిర్మించిన నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు.

గండికోట నుంచి మైలవరానికి నీరు నిలుపుదల

కొండాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి ఆదివారం నీటిని నిలుపుదల చేసినట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులోకి జీ ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా వచ్చే ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులకు తగ్గడంతో మైలవరం జలాశయానికి నీటిని నిలుపుదల చేసినట్లు ఈఈ తెలిపారు. అదేవిధంగా గండికోట నుంచి సీబీ ఆర్‌కు 1000 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులు తున్నామని ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీటిమట్టం 26.85 టీఎంసీలు, కాగా ప్రస్తుతం 24.343 టీఎంసీల నీటిమట్టం ఉందని ఆయన తెలిపారు.

డిపో అభివృద్ధికి కృషి చేస్తా

జమ్మలమడుగు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి చేస్తానని డిపో మేనేజర్ సుబ్బమ్మ తెలిపారు. ఆదివారం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో కొత్త డిపో మేనేజర్ బాధ్యతలు చేపట్టి కార్మికులతో ఆమె సమావేశమయ్యారు. స్త్రీశక్తి పథకానికి బస్సులను జాగ్రత్తగా తీసుకెళ్లాలని కార్మికులకు సూచించారు. ఎప్పటికప్పుడు బస్సుల కండీషన్‌లో ఉంచాలని ఆదేశించారు. అనంతరం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ గ్యారేజీ కమిటీ కొత్తగా బాధ్యతలు చేపట్టిన డిపో మేనేజర్ సుబ్బమ్మను సన్మానించారు. ఇక్కడ పనిచేస్తున్న డిపో మేనేజర్ కడపకు వెళ్లినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై కొరడా


ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

బద్వేలు, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి):భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. మండలంలోని తిప్పనపల్లె, వీరబల్లె గ్రామ పొలాల్లో రాత్రికి రాత్రే ఎక్స్‌కవేటర్ ద్వారా ప్రభుత్వ భూమిని చదును చేసి కొంతమంది ఆక్రమించుకుని ప్రభుత్వ స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి రావడంతో ఆర్డీఓ చంద్రమోహన్ ఆదేశాల మేరకు తహశీల్దారు ఉదయభాస్కర్, సిబ్బంది కంచెను తొలగించి ఆక్రమణకు గురైన వీరబల్లె గ్రామంలో 370 సర్వేనెంబరులో 2 ఎకరాలు, తిప్పనపల్లెలో 381,382 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారు. స్థంభాలను తొలగించి ఆక్రమిత గురైన భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు ఉదయభాస్కర్ తెలిపారు.

ఎంఈఎఫ్ అధ్యక్షుడిగా గురయ్య



బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):బ్రహ్మంగారిమఠం మండలంలోని మాదిగ ఉద్యోగ సంఘాల (ఎంఈఎఫ్) నూతన అధ్యక్షుడిగా కె.గురయ్య ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ కమిటీని ఆదివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశా లలో ఎంఈవో జిల్లా నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఎంఈఎఫ్ నాయకుడు జోసెఫ్, మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు లక్కినేని బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు హరనాథ్ హాజరయ్యారు. వారి సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు., మండ ల ఎంఈఎఫ్ అధ్యక్షుడిగా కె.గురయ్య, మండల కార్యదర్శిగా సోమిరెడ్డిపల్లె ఓబయ్య, కోశాధికారిగా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సత్యాల బాలసుబ్బయ్య, బాలాజీ మున్నెల్లి గోపాల్, సురేశ్, రావక్రిష్ణ, బి.మఠం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జపమాలాగ్ని ఉత్సవం

పోరుమామిళ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప మేత్రాసనంలో ఉండే పోరుమామిళ్ల విచారణలో ఆదివారం పరిశుద్ధ జపమాలాగ్ని కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం జపమాల ధ్యానం గుడి చుట్టూ పేరు ప్రదక్షిణ నిర్వహించి పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఫాదర్ విజయ భాస్కర్, సహాయకు గురువులు ఫాదర్ దిలీప్ పాల్గొన్నారు. క్యాథలిక్కు లు, క్రైస్తవులు భక్తి, నమ్మకం ఎక్కువ విశ్వసంతో పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు జరిగే ఈ పరిశుద్ధ జపమాలాగ్నిలో క్రైస్తవులు పాల్గొన్నారు. 6న సాయంత్రం 5గంటలకు అంబేద్కర్ సర్కిల్ నుండి పోరు మామిళ్ల పురవీధుల గుండా జపమాలాగ్ని దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. మంగళవారం దివ్యవాణి పూజ నిర్వహిస్తారని కార్యక్రమానికి కడప మేత్రాసనంలోని గురువులు పాల్గొంటారని భోజన వసతి ఉంటుందన్నారు.

108 వాహనంలో ప్రసవం

బి.కోడూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రభలవీడు గ్రామానికి చెందిన దుర్గాభవానీ అనే మహిళ పురిటి నొప్పులు రావడంతో 108 వాహన సహాయంతో కడప రిమ్స్‌కు తీసుకువెళుతుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వాహనంలోనే ప్రసవించింది. 108 సిబ్బంది ఈఎనటి బాల ఓబయ్య పైలెట్ ప్రసాద్ చాకచక్యంగా కష్టతరమైన కాన్పును సులభతరంగా చేయించారు. దీంతో తల్లి బిడ్డక్షేమం. బంధువులు, వారి కుటుంబ సభ్యులు 108 సిబ్బందిని అభినందించారు.

ధరలేక మొక్కజొన్న రైతు దిగాలు



దువ్వూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల బెడద, పంట బాగుంటే గిట్టుబాటుకాని ధరలు. ఇలా ఏదో ఒక రూపంలో అన్నదాతను ప్రతి ఏటా అవాంతరాలు దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న రైతును సమస్యలు వెంటాడుతున్నాయి. దిగుబడి ఆశించిన మేరకు అందుతున్నా ధరలు నిరాశ పరుస్తున్నాయి. ఈ ఏడు ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్నను రైతులు విస్తారంగా సాగు చేశారు. పెట్టుబడులు తక్కువ కావడంతో రైతులు దీని సాగుకు మొగ్గుచూపారు. మండలంలోని వెంకుపల్లె, ఏకోపల్లె, దువ్వూరు, రాంసాయినగర్, మూడిండ్లపల్లె, పెద్దభాకరాపురం, గుడిపాడు, రామాపురం, చింతకుంట, నీలాపురం, దాసరిపల్లె, మదిరేపల్లె, నాగాయపల్లె, మనేరాంపల్లి, చల్లబసాయిపల్లె పరిధిలో వెయ్యి ఎకరాలకుపైగా మొక్కజొన్నను సాగు చేశారు. పంట కాల వ్యవధి నాలుగు నెలలే కావడం, దీనికి పెట్టుబడులు తక్కువ కావడంతో నాలుగేళ్లుగా ఈ పంటపై రైతులకు ఆసక్తి పెరిగి సాగుకు పూనుకుంటున్నారు.

గిట్టుబాటు ధర పట్టదా!

మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో అధికారులుకానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోకపోవడంతో రైతులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. పంట చేతికందిన సమయంలో గిట్టుబాటు ధర లేకపోవడంతో పండిన పంటను ప్రైవేటు వ్యాపారులకు తెగనమ్ముకుంటున్నారు. ఎకరాలో దీని సాగుకు 25 వేల పైచిలుకు పెట్టుబడిగా ఖర్చు వస్తోంది. పొలం కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి సరేసరి. దీనికి లాభాలు అంతంత మాత్రంగా కనబడుతున్నాయి.

తేమశాతం పేరుతో ధరలో కోత

మొక్కజొన్న పంట కోత దశకు చేరడంతో రైతులు మిషన్లతో పంట నూర్పిడులు మొదలు పెట్టారు. ఎకరాలో పంటను తొలగిస్తే రూ.3 వేలు మిషన్ ఖర్చు వస్తోంది. తీసిన పంటను రోడ్లపై ఆరబెడుతున్నారు. వాటి కొనుగోలుకు వచ్చిన వ్యాపారులు తేమ శాతం పేరుతో క్వింటా రూ.1800 నుంచి రూ.2 వేలు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. నిరుటి ధరతో పోల్చుకుంటే ఇది తక్కువగా ఉంది.

ఆశించిన లాభాలు లేవు

మొక్కజొన్న దిగుబడులు బాగా వస్తున్నాయి. ఆశించిన లాభాలు కనపడటం లేదు. క్వింటా రూ.2,500 ధర పలికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తే రైతు కష్టానికి ఫలితం ఉంటుంది. ఆదిశగా ప్రభుత్వం చొరవ తీసుకుని మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి.

- ఆర్ల వెంకటసుబ్బయ్య, ఏకోపల్లె, మొక్కజొన్న రైతు

వైభవంగా రామాలయ వేడుకలు


పండుగవేడుకల్లో పాల్గొన్న నాయకులు

కాశినాయన అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి) మండలంలోని రామచంద్రాపురంలో గ్రామంలో రామాలయ ప్రతిష్ఠ అనంతరం నిర్వహించే 41 రోజుల పండుగను ఆదివారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అమ్మ వారికి సాంప్రదాయ బద్ధంగా పొంగళ్ళు పెట్టారు. అనంతరం జంతు బలులు ఇచ్చి బంధు మిత్రులకు విందుభోజనాలు ఏర్పాటుచేశారు.పండుగ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపా ధ్యక్షుడు నర్సాపురం సహకార సంఘం చైర్మన్ బంగారు గుర్విరెడ్డి, టీడీపీ నాయకులు బి.వెంకట్రామిరెడ్డి(సీడ్స్) శ్రీని వాసులరెడ్డి,రోహిత్‌రెడ్డి, వైసీపీ బద్వేల్ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త ఎన్.విశ్వనాథ్ రెడి, గంగనపల్లె సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు గురుబ్రహ్మం, మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శత జయంతి


బైకు ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

పోరుమామిళ్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని మల్లకతవ ఆంజనేయస్వామి గుడిలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రారంభించి వంద సంవత్సరాల సందర్భంగా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు కేశవరావు, బలిరామ్ హెడ్గే, గురూజీ భరతమాత చిత్రపటాలకు పూలమాలలు అలంకరించి కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఫారెస్టు రేంజర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ఆర్ఎస్ఎస్ రక్షణ కవ చంగా నిలిచిందన్నారు. అనంతరం పోరుమామిళ్ల పురవీధులలో బైకు ర్యాలీ నిర్వహించారు.

మైలవరంలో: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతజయంతి వేడుకలు మండల పరిధిలోని వేపరాల గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, వివేకానంద కాలేజీ కరస్పాండెంట్ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తవుతున్నకారణంగా 2025 విజయ దశమి నుంచి 2026 విజయ దశమి వరకు అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సీనియర్ కార్యకర్తలు చిన్నిక్రిష్ణయ్య, ఆదినారాయణ, బీజేపీ నేతలు పాములేటి, శ్రీనివాసులు, సీజే కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల వినూత్న నిరసన

జమ్మలమడుగు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో సచివాలయ ఉద్యోగులు వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం జమ్మలమడుగులోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఎల్‌డీవో ప్రధాన కార్యాలయం ఎదురుగా, చుట్టుపక్కల సంబంధించిన సచివాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. వారు ముందుగా డీఎల్‌డీవో కార్యాలయం వద్ద నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అదే ఆవరణంలో నిరసనలో భాగంగా వంట వార్పు నిర్వహించారు.

సమాజంలో గురువులది ఉన్నతస్థానం


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులది ఉన్నతమైన స్థానమని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్మా ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను గోపీకృష్ణ హైస్కూలులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలలు రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కడపజిల్లాలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన 150 మంది ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి, ఎంఈవో సావిత్రమ్మ, కృష్మా వ్యవస్థాపకుడు సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, కార్యదర్శి బాలసుబ్బారెడ్డి, కోశాధికారి ఆంజేయులు, గౌరవాధ్యక్షులు రాజారావు, గోపీకృష్ణ పాఠశాల కరస్పాండెంట్ ప్రదీప్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం


రోటరీ క్లబ్‌ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ క్లబ్ సభాభవనంలో రోటరీ క్లబ్ రోటరీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లె శ్రీను, రోటరీ డిస్ట్రిక్టు గవర్నర్ సాధు గోపాలకృష్ణ, రోటరీ కంటి ఆస్పత్రిఅధ్యక్షుడు తోట శివకుమార్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని పేర్కొన్నారు. భావిభారత నిర్మాతలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు గజ్జెల వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి షేక్‌బాబా, కోశాధికారి దొంతు బాలాజీ, బేపారి జాకీర్ అహమ్మద్, మల్లికార్జున, ఆయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం తప్పదు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు ఇలియాస్‌బాష

జమ్మలమడుగు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యారంగ ఆర్థికపరమైన సమస్యలపై వెంటనే స్పందించకపోతే ఉపాధ్యాయులు పోరుబాటకు సిద్ధమని ఎస్టీయూ కడపజిల్లా శాఖ అధ్యక్షుడు ఇలియాస్‌బాష అన్నారు. ఆదివారం జమ్మలమడుగులోని ఎస్టీయూ రీజినల్ కౌన్సిల్ స సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అయినా ఉపాధ్యాయుల సమస్యలపై కనీస స్పందన లేదన్నారు. 12వ పీఆర్‌సీ కమిటీ ఏర్పాటుతోపాటు పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్లు చేశారు. సమావేశంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ప్రధానోపాధ్యాయులు రామకృష్ణమ్మ, జింకా సుబ్రమణ్యం, ఉపాధ్యాయుల సంఘం జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన ఎంఈవో చంద్రశేఖర్‌రావుతోపాటు రాష్ట్రస్థాయిలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ అనే పరీక్షలో ప్రథమస్థానం పొంది ఢిల్లీలో అవార్డు అందుకు న్న దొమ్మర నంద్యాల జడ్పీ హైస్కూలు విద్యార్థిని నందినిని సన్మానించారు. కార్యక్రమంలో మూడు మండలాల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్, పరమేశ్వరయ్య, ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళన


మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు ఈనెల 7వ తేదీ ఫ్యాప్టో ఆధ్వర్యంలో విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్నారని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జార్జిక్లబ్‌లో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం చాచివేత ధోరణి ప్రదర్శిస్తోందని విమర్శించారు. 12వ పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డీఏను వెంటనే ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులరెడ్డి, రమేష్‌రెడ్డి, సుబ్బారెడ్డి, జాన్‌సురేష్, వరప్రసాద్‌రెడ్డి, నారాయణరెడ్డి, దామోదర్, రమణయ్య పాల్గొన్నారు.

గొర్రెల సంత స్థలం మార్పు


జమ్మలమడుగు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయం సమీపాన ప్రధాన రోడ్డుపై గత కొంత కాలంగా గొర్రెల సంతను నిర్వహిస్తుండగా ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ పక్కన స్థలానికి మార్పుచేశరు. ఈ సమస్యను ప్రజలు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని పిలిచి గొర్రెల సంతను రోడ్డుపై లేకుండా వెంటనే మార్పు చేయాలని ఆదేశించారు. దీంతో కమిషనర్ సంబంధిత యజమానులకు తెలియజేస్తానని చెప్పి సంత స్థలాన్ని మార్పు చేశారు.

గ్యార్మీ సందర్భంగా దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): దస్తగిరి స్వామి గ్యార్మీ పండుగను పురష్కరించుకుని మట్టి మసీదు వీధిలో 25వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. దస్తుమియా అండ్ సర్ఫ్ షేక్ ఖాదర్‌వలి సహకారంతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ దివ్యాంగులకు దుప్పట్లను అందజేశారు. కార్యక్రమంలో ఆల్‌ఆఫ్‌యూ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, రషీద్, కొండమ్మ, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్‌లో: స్థానిక సుమిత్రనగర్‌లో ఉన్న ఉమర్‌ఫరూక్ మసీదులో కులమతాలకతీతంగా గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సుమిత్రనగర్‌లోని మసీదు వద్ద దస్తగిరి స్వామి గ్యార్మీ వేడుకలను నిర్వహిస్తున్నామని, కులమతాలకతీతంగా జరిగే వేడుకలకు అందరూ హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిమెంట్ షరీఫ్, పీసీసీ సెక్రటరీ ఇమాంసాహెబ్, నాయబ్, జోషామ్, దావుద్, జిలానీ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఖాజీపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతోపాటు తమలో ఉన్న నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని ప్రిన్సిపాల్ ఎం.విజయ నరసింహ పేర్కొన్నారు. ఆదివారం మోడల్ స్కూల్‌లో వారు మాట్లాడుతూ పిల్లలు దసరా సెలవుల్లో కాలయాపన చేయకుండా పది రోజులపాటు సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో సచివాలయాలు, మీసేవా కేంద్రాలు, పోస్టాఫీసు వంటి వివిధ కార్యాలయాల్లో విద్యార్థులు అవగాహన పెంచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.